క్లుప్తంగా

నేడు ఉపాధి పథకం ప్రజావేదిక

శావల్యాపురం: స్థానిక మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో మండల స్థాయిలో 18వ విడత సామాజిక అడిట్ కార్యక్రమం శుక్రవారం ఉదయం 10 గంటలకు ప్రారంభమౌతుందని ఎంపీడీవో సీతారామయ్య గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2024 ఏప్రిల్ నుంచి 2025 మార్చి వరకు జరిగిన ఉపాధి పనులకు మండల స్థాయిలో సోషల్ అడిట్ జరుగుతుందన్నారు. 464 పనులకు రూ.79402736 ఖర్చు చేసినట్లు తెలిపారు. ప్రజావేదిక కార్యక్రమానికి జిల్లా ఉపాధి అధికారులు, ప్రజాప్రతినిధులు, 15 గ్రామపంచాయతీల ఉపాధి సిబ్బంది డీఆర్‌పీలు, ఎస్ఆర్‌పిలు పాల్గొంటారన్నారు.

వెలుగు పథకంపై అధికారుల సమీక్ష



బొల్లాపల్లి: స్థానిక వెలుగు పథకం కార్యాలయంలో జిల్లా అధికారులు పలు అంశాలపై గురువారం సమీక్ష చేశారు. వెలుగు పథకం ఏపీఎం జి.శేషారెడ్డి సమీక్ష గురించి వివరాలు వెల్లడించారు. మండలంలో 33 మంది రైతులకు షెడ్ నెట్స్ మంజూరయ్యాయని వారు ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసుకోవాలని అవగాహన కల్పించారు. మహిళా పారిశ్రామికవేత్తలను తయారు చేసేందుకు బ్యాంకు లింకేజీ రుణాలు మంజూరు చేయాలని వారికి తగిన విధంగా తోడ్పాటు అందించాలన్నారు చెంచు సమాఖ్యల అభివృద్ధికి చేపట్టాల్సిన విధివిధానాలు గురించి చర్చించారు. నిరుపేదల జీవనోపాధికి సంబంధించి రుణాల ఏర్పాటుకు ప్రణాళిక తయారీ చేయాలని సూచించారు. సమావేశంలో పల్నాడు జిల్లా ఏపీ డి.రాజాప్రతాప్ ఐటీడీఏ ఏపీడి పీక్లా నాయక్, బ్యాంకు లింకేజీ డీపీఎం శ్రీనివాస్ లబ్ధి, హెడ్ డీపీఎం డేవిడ్, ఎల్ హెచ్.ఎ.పి.యం జి.వాసుబాబు సీసీలు పాల్గొన్నారు.

అరుణాచలంలో వినుకొండ వాసుల అన్నదానం



వినుకొండ: ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రమైన తమిళనాడులోని తిరువాన్నమలై (అరుణాచలం) క్షేత్రం నందు పల్నాడు ప్రాంతానికి చెందిన భక్తులు అన్నదాన కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. వినుకొండ, పరిసర ప్రాంతాల భక్తులు ప్రతినెలా పౌర్ణమి రోజున అరుణాచల క్షేత్రం నందు అన్నదాన కార్యక్రమం చేపడుతున్నారు. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమం కమిటీ సభ్యులు పారెళ్ళ మల్లికార్జునరావు, ముండ్రు చంద్రశేఖర్ అరేపల్లి కొండలు మాట్లాడుతూ ప్రతి నెల పౌర్ణమి సందర్భంగా గిరి ప్రదక్షిణ చేయు భక్తుల సౌకర్యార్థం గత 20 నెలల నుంచి నిర్విరామంగా అన్నదాన కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. ప్రతినెల పౌర్ణమి రోజున అరుణాచల క్షేత్రంలోని గిరివలయం రోడ్డులో గల వాయులింగం వద్ద అన్నదానం జరుగుతుందని కావున అరుణాచలం వచ్చే భక్తులు ఈ అన్నదాన కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా వారు కోరారు. అలాగే అన్నదానానికి సహకరిస్తున్న భక్తులందరికీ పేరుపేరునా ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ అన్నదాన కార్యక్రమంలో కమిటీ సభ్యులు, వద్దిపాటి బ్రహ్మాచారి, టీవీ షాప్ బ్రహ్మయ్య, లాయర్ శంకర్, పెద్ది శెట్టి చరణ్, నడికుడి సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

పాఠాలు చెప్పేవారేరీ?

- బొల్లాపల్లిలో అరకొరగా ఉపాధ్యాయులు
- కుంటుపడుతున్న విద్యాబోధన
- విద్యార్థుల భవిష్యత్ ప్రశ్నార్థకం
- 196 మందికి గాను 105 ఖాళీలు!

బొల్లాపల్లి: వెనుకబడిన బొల్లాపల్లి మండలంలో ఉపాధ్యాయుల కొరత వేధిస్తోంది. ఈ ఏడాది ఆరంభంలోనే బదిలీల ప్రక్రియ జరగడంతో మండలానికి అరకొరగా ఉపాధ్యాయులు రావడం జరిగింది. ఈ విద్యా సంవత్సరం బోధన కొంటుపడి విద్యార్థుల భవిష్యత్ ప్రశ్నార్థకంగా తయారైందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. కూటమి ప్రభుత్వం పాలనలో ఏడాది అమలుపరిచిన నూతన విద్యా విధానం వల్ల ఉపాధ్యాయుల సర్దుబాటు సక్రమంగా లేకపోవటం విద్యార్థుల పాలిట శాపంలా మారింది.

వేధిస్తున్న ఉపాధ్యాయుల కొరత

మండలంలో 10 ఉన్నత పాఠశాల మినహా బేసిక్ ప్రైమరీ, ఫౌండేషన్, మోడల్ ప్రైమరీ స్కూల్స్‌తో కలిపి మొత్తం 76 పాఠశాలలు ఉన్నాయి. ఉన్నత పాఠశాలలతో కలిపి 86 స్కూల్స్ ఉన్నాయి. వీటిల్లో 4000 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ఆయా పాఠశాలల బోధనకు అవసరమైన 196 మంది ఉపాధ్యాయులు ఉండాల్సి ఉండగా 91 మంది మాత్రమే ఉన్నారు కొన్ని పాఠశాలలో ఉపాధ్యాయులు లేకపోవడంతో అధికారులు అడ్జస్ట్ చేసిన సందర్భాలు ఉన్నాయి. దీంతోపాటు మండలానికి 2008 బ్యాచ్‌కి చెందిన 22 ఎంపీపీ స్కూల్ కోరుకున్నారు. అయితే ఉపాధ్యాయులను పాఠశాలలను గుర్తించి సవరించడంతో అరకొరగా బోధన కొనసాగుతోంది.



గరికపాడు ప్రభుత్వ పాఠశాల

ప్రయివేటు వైపుగా..

మండంలో పాఠశాలలో ఎస్సీ ఎస్టీ, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు చెందిన విద్యార్థులు అధికం. గత ఏడాది నుంచి మండలంలో పలు పాఠశాల నుంచి విద్యార్థులు సమీపంలోని ప్రవేట్ పాఠశాల తరలి వెళ్తున్నారు. ఈ విద్యా సంవత్సరం ఆరంభంలోనే ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియతో మండలంలోని పలు పాఠశాలల్లో ఉపాధ్యాయుల ఖాళీలు ఏర్పడ్డాయి. ప్రభుత్వ ఉత్తర్వులు ప్రకారం (జీవో నెంబర్ 22 ప్రకారం) ఉపాధ్యాయులను బదిలీల్లో భాగంగా ఆయా పాఠశాలల్లో కనీసం 50 శాతం ఉపాధ్యాయులు తక్కువగా ఉండకూడదని నిబంధనలు ఉన్నాయి. బదిలీ అయిన పాఠశాల నుంచి కోరుకున్న పాఠశాలలో జాయిన్ అయినా కూడా తిరిగి బదిలీ అయిన పాఠశాలకు రావాల్సి ఉంది. మండలంలో కొన్ని పాఠశాలలో నిబంధన సక్రమంగా అమలు కాలేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయినప్పటికీ మండలంలోని పరిస్థితులు గమనించి పలు పాఠశాలకు రీ బ్యాక్ ఉత్తర్వులు ఇచ్చామని అధికారులు అంటున్నారు. మండలంలోని గంగుపల్లి తండా, కండ్రిక, వంటి కొన్ని పాఠశాలలో విద్యార్థుల సంఖ్య అధికంగా ఉంది. ఉపాధ్యాయుల కొరత ఉన్నప్పటికీ గరికపాడు మోడల్ ప్రైమరీ స్కూల్ నుంచి ఒకరిని డిప్యూటేషన్ పై జిల్లా విద్యాశాఖ అధికారి పంపారని, ఉపాధ్యాయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. ఆయా పాఠశాలలో ఒకరిద్దరు మాత్రమే ఉపాధ్యాయులు మాత్రమే ఉన్నారని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. ఈ నేపథ్యంలో ఈ విద్యా సంవత్సరం బోధన ఎలాసాగుతుంది, పాఠాలు ఎలా చెబుతారు? అని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు వెనుకబడిన మండలమైన బొల్లాపల్లిలోని పాఠశాలలపై దృష్టి సారించి ఉపాధ్యాయుల కొరత లేకుండా చూడాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



పాఠశాలలో అరాకొర విద్యార్థులు

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లా



ఉపాధ్యాయుల సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. మండలంలో బేసిక్ ప్రైమరీ, ఫౌండేషన్, మోడల్ ప్రైమరీ స్కూల్స్ మొత్తం కలిపి 76 ఉన్నాయి వీటిలో 196 మంది ఉపాధ్యాయులు అవసరం ఉంది. కానీ 105 ఖాళీలు ఉన్నాయి. ఎంటీఎస్ బ్యాచ్ రాకతో అసలు ఉపాధ్యాయులైన పాఠశాలకు సర్దుబాటు చేశాం. మరో 10 నుంచి 15 మంది ఉపాధ్యాయుల అవసరం ఉంది. ఉపాధ్యాయుల కొరత లేకుండా చూస్తాం. విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తకుండా బోధన కొనసాగిస్తాం. .

– సయ్యద్ జఫ్రుల్లా, ఎంఈఓ

నేడు బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీపై సమీక్ష

వినుకొండ: నియోజకవర్గ వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యులు, మాజీఎమ్మెల్యే బొల్లాబ్రహ్మ నాయుడు ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ' పైకార్యక్రమాన్ని నేడు నిర్వహించనున్నారు. మధ్యాహ్నం 3:00 గంటలకు కారంపూడి రోడ్డులోగల బొల్లా కన్వెన్షన్ హాలులో నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో వినుకొండ నియోజకవర్గ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పలువురు నాయకులు కోరారు.

పరిశోధన రంగంలో కేంద్ర ప్రభుత్వ ప్రోత్సాహకాలు

నరసరావుపేట రూరల్: పరిశోధన రంగంలో విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం ప్రోత్సాహకాలను అందజేస్తుందని సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ శాస్త్రీయ పారిశ్రామిక పరిశోధన విభాగం డైరక్టర్ డాక్టర్ బి.విజయ్ కుమార్ సాహు తెలిపారు. ఏఎమ్‌రెడ్డి విద్యాసంస్థలలో ఇంటిలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్, పేటెంట్లు, సూక్ష్మ,చిన్న మధ్య తరగతి పరిశ్రమలపై అవగాహన సదస్సును బుధవారం నిర్వహించారు. నేషనల్ రీసెర్చ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సహకారంతో నిర్వహించిన సదస్సుకు డాక్టర్ కుమార్ సాహు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కళాశాల కార్యదర్శి అట్లూరి శాంతి మాట్లాడుతూ విద్యార్థుల పరిశోధన, ఆవిష్కరణల పట్ల ఆసక్తి పెంచుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిహెచ్ మల్లికార్జున్, డిప్లొమా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.కృష్ణారెడ్డి, ఫార్మసీ కళాశాల డాక్టర్ పి.భార్గవ భూషణరావు తదితరులు పాల్గొన్నారు.

ఈవ్‌టీజింగ్, ర్యాగింగ్‌లకు పాల్పడితే క్రిమినల్ కేసులే

నరసరావుపేట డీఎస్పీ నాగేశ్వరరావు

యడ్లపాడు: పాఠశాల, కళాశాలల్లో ఈవ్ టీజింగ్, ర్యాగింగ్ చేయడం..అలాగే చెడు వ్యసనాలైన మత్తు పదార్థాల వినియోగం జరిగితే కఠిన చర్యలు తప్పవని నరసరావుపేట డీఎస్పీ కె నాగేశ్వరరావు హెచ్చరించారు. మండలంలోని బోయపాలెం గ్రామంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలుర గురుకులం పాఠశాలలో గురువారం మెగా పేరెంట్ డే కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఎస్ఎంసీ చైర్మన్ ఎ ప్రతాప్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డీఎస్పీ మాట్లాడుతూ విద్యార్థులకు మంచి క్రమశిక్షణ, పెద్దల పట్ల ప్రేమవాత్సాల్యం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. మరో అతిథి వెంగళరాయుడు పాఠశాలకు ఆర్‌వో ప్లాంట్‌ను ఇస్తానంటూ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ ఎం శివనాగలక్ష్మీ, స్వచ్ఛంద సొసైటీ సీహెచ్ నాగమల్లేశ్వరీ, ఎస్ఎంసీ సభ్యులు సుశీల, రాజారత్నం, వేళంగిణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. లింగారావుపాలెం జెడ్పీహైస్కూల్లో... మెగా పేరెంట్స్ మీటింగ్ ఘనంగా నిర్వహించడం జరిగింది.



విద్యార్థినికి స్కూల్ కిట్‌ను పంపిణీ చేస్తున్న డీఎస్పీ కె.నాగేశ్వరరావు

కార్యక్రమంలో హైస్కూల్ హెచ్ ఎం కేవీ రామిరెడ్డి, సర్పంచ్ షేక్ కరీమున్, ఎంపీటీసీ సభ్యులు ఆలోకం వీరరాఘవయ్య, ఎస్ఎం షేక్ జాన్‌వలి, గ్రామ పెద్దలు ఆలోకం పెద్దబ్బయ్య, నంబూరు కృష్ణారావు, మురుకుట్ల శ్రీధర్, నంబూరి శివరామకృష్ణ, తోకల సత్యనారాయణ, తులాబంధు సత్యనారాయణ, గుంటుపల్లి రమణయ్య, ఉపాధ్యాయులు వి.శ్రీనివాసరావు, విజయ శామ్యూల్, మేరీశౌరీలు, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణ భూమి స్వాధీనం చేసుకున్న రెవెన్యూ



నూజెండ్ల: మండలంలోని అయినవోలు పంచాయతీ యోగిరెడ్డిపాలెం గ్రామంలో ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమిని రెవెన్యూ అధికారులు సర్వే చేసి గురువారం స్వాధీనం చేసుకున్నారు. వివరాలు మేరకు గ్రామానికి చెందిన సర్వే నంబరు 105.1/ఎ లో 3.15 ఎకరాల కుంట పోరంబోకు భూమి ఆక్రమణ గురైందని పశువుల తాగు నీటి సమస్య వస్తుందని తక్షణమే ఆక్రమణలు తొలిగించాలని గ్రామస్తులు రెవెన్యూ అధికారులకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ మేరకు తహసీల్దారు ఆదేశాల మేరకు మండల సర్వేయర్ పి.చండీరాణి తన సిబ్బందితో ఆక్రమణకు గురైన భూమిని సర్వే చేశారు. ప్రభుత్వ భూమిగా నిర్ధారణ కావటంతో సరిహద్దురాళ్ల ఏర్పాటు చేశారు. ప్రభుత్వ భూములను ఆక్రమణలు చేస్తే అటువంటి వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని తహసీల్దారు రమేష్‌కుమార్ హెచ్చరించారు. ఆక్రమణలు తొలిగించటంతో గ్రామస్తులు రెవెన్యూ అధికారుల తీరును అభినందించారు.

చర్చలతో సమస్యలకు పరిష్కారం లభ్యం

వెలుగు కార్యాలయంలో సమాఖ్య సమావేశం

యడ్లపాడు: క్రమం తప్పకుండా సమావేశాల నిర్వహణ..సమస్యలపై చర్చలతో మహిళా సంఘాల ఆర్థిక స్థిరత్వం, స్వయం సమృద్ధికి దోహదపడే చక్కని నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంటుందని మండల సమాఖ్య అధ్యక్షురాలు నాగలక్ష్మి పేర్కొన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో గురువారం మండల సమాఖ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మహిళా సంఘాల అభివృద్ధి, వారి ఆర్థిక పురోగతిపై చర్చించారు. వార్షిక ప్రణాళిక అమలు, పథకాల గ్రౌండింగ్, మహిళా నేతృత్వంలోని ఎంటర్ ప్రెన్యూర్‌షిప్ ప్రోత్సాహంపై ప్రధానంగా దృష్టి సారించినట్లు సంఘం ప్రతినిధులు తెలిపారు.

కాశీకి హిమాలయ బాబా పాదయాత్ర

వినుకొండ: వినుకొండ ప్రాంతం నుంచి కాశీవరకు పాదయాత్రగా వెళుతున్నామని పూజ్యశ్రీ హిమాలయబాబా వెల్లడించారు. విఠంరాజుపల్లి సమీపంలో శాంతి ఆశ్రమంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత నాలుగేళ్ల నుంచి వినుకొండలో నిర్వహించిన అనేక ఆధ్యాత్మిక కార్యక్రమాలకు సహకరించిన వినుకొండ ప్రాంత భక్తులకు ఆయన ధన్యవాదాలు తెలియజేశారు. వినుకొండ కొండపై అఖండజ్యోతి ఏర్పాటు చేశామని 12 కోట్లకు పైగా ఖర్చు చేసి అనేక యాగాలు, దేవీ నవరాత్రులు జరిపించామని అన్నారు. రానున్న రోజుల్లో కూడా వినుకొండలో శాంతి ఆశ్రమం తరఫున ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తామని అన్నారు. కార్తిక మాసం పౌర్ణమినుంచి కొండపై యాగాలు జరుగుతాయని, దేవీ నవరాత్రులు కూడా యధావిధిగా తన శిష్యబృందం ఆధ్వర్యంలో నిర్వహిస్తామని చెప్పారు.

ఉత్తరప్రదేశ్‌లో మహాయాగం



మాట్లాడుతున్న హిమాలయబాబా

వినుకొండ ప్రాంతంలో మహాయాగం నిర్వహించేందుకు చేసిన ప్రయత్నాలు కొంతమంది స్వార్థపరుల దుష్ప్రచారం.. అనివార్య కారణాలవల్ల ఉత్తరప్రదేశలో నిర్వహించనున్నట్లు చెప్పారు. ఎలాంటి లాభాపేక్ష లేకుండా లోక కళ్యాణం కోసం తలపెట్టిన కాశీ పాదాయాత్ర అనంతరం హిమాలయాలకు వెళతానని మహాయాగం మాత్రం ఆగకుండా కొనసాగిస్తామని అన్నారు.

దాసరి చిట్టిబాబుకు ప్రజా సేవారత్న అవార్డు

చిలకలూరిపేటటౌన్: పట్టణానికి చెందిన ప్రముఖ న్యాయవాది, మాజీ అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ దాసరి చిట్టిబాబు 'ప్రజా సేవారత్న' అవార్డును అందుకున్నారు. గురు పౌర్ణమి పర్వదినం సందర్భంగా దత్తసాయి అన్నదాన సమాజం, జయ జయ సాయిట్రస్ట్ సంయుక్తంగా నిర్వహించిన విశిష్ట కార్యక్రమంలో చిట్టిబాబుకు ఈ అవార్డును ప్రదానం చేశారు. ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ పూసపాటి బాలాజీ, ప్రముఖ వైద్యులు డాక్టర్ ముద్దన రమేష్‌బాబు, డాక్టర్ లావు సుష్మ చేతుల మీదుగా ఆయన ఈ గౌరవాన్ని స్వీకరించారు. అనంతరం వారు మాట్లాడుతూ న్యాయవాదిగా, జ్ఞానేశ్వరీ అర్బన్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీకు గౌరవ సలహాదారునిగా పలు సామాజిక, న్యాయసేవా కార్యక్రమాల్లో క్రియాశీలకంగా పాల్గొంటూ పేదలకు నిస్వార్థ సేవలు అందించినందుకు ఈ అవార్డు లభించినట్లు వారు పేర్కొన్నారు. భవిష్యత్తులో మరిన్ని సేవలు అందించి ప్రజల్లో చైతన్యాన్ని తీసుకురావాలని ఆకాంక్షించారు. దాసరి చిట్టిబాబుకు పలువురు ప్రజాప్రతినిధులు, న్యాయవాదులు, సంఘ సంస్థల ప్రతినిధులు అభినందనలు తెలియజేశారు.



అవార్డు ప్రదానం చేస్తున్న ట్రస్ట్ ప్రతినిధులు

విధానం మార్చుకోండి.. లేకుంటే ఆగ్రహం తప్పదు

సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు ఏవీ నాగేశ్వరరావు

నరసరావుపేట: కేంద్రంలో వరుసగా మూడోసారి అధికారంలోకి వచ్చిన ప్రధాని నరేంద్రమోదీ కార్పొరేట్‌లకు పక్షాన నిలిచి ప్రజా, కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలు అవలంభిస్తూ దూకుడుగా వ్యవహరిస్తున్నారని, తన విధానాలు మార్చుకోకుంటే కార్మికుల ఆగ్రహానికి గురికాక తప్పదని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు ఏవి నాగేశ్వరరావు అన్నారు. పట్టణంలోని సీపీఎం జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు కె.హనుమంతరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన పల్నాడు జిల్లా కమిటీ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. మోదీ అవలంబిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా కేంద్ర కార్మిక సంఘాల పిలుపు మేరకు తొమ్మిదవ తేదీన చేపట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో పాల్గొన్న కార్మికులు, స్కీం వర్కర్లు, రైతులు, ఉద్యోగులకు రాష్ట్ర కమిటీ తరపున అభినందనలు చెప్పారు. రాష్ట్ర కార్యదర్శి ముజఫర్ అహ్మద్, పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.ఆంజనేయులు నాయక్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థలలో పనిచేస్తున్న ఉద్యోగులకు పే స్కేల్ ప్రకారం వేతనాలు చెల్లించాలని ఓపీఎస్ పునరుద్ధరించాలని కోరారు. బీజేపీతో అంటగాగుతున్న పార్టీలను మోదీ మింగేయటం ఖాయమని, ఆయా పార్టీలు తెలుసుకొని మసులుకోవాల్సిన అవసరం ఉందన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాలలో సైతం మోడీ విధానాలను వ్యతిరేకిస్తుంటే రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాన్ మోదీని ప్రసన్నం చేసుకునేందుకు రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టు పెడుతున్నారని అన్నారు.



మాట్లాడుతున్న నాగేశ్వరరావు

జిల్లా ఉపాధ్యక్షులు గుంటూరు విజయకుమార్, అనుబంధ సంఘాల నాయకులు డి.శివకుమారి, జి.మల్లేశ్వరి, కె.పి. మెటిల్డాదేవి, తెలకపల్లి శ్రీను, బొంకూరి వెంకటేశ్వర్లు, షేక్.సిలార్ మసూద్, పేరుబోయిన వెంకటేశ్వర్లు, బందగీ సాహెబ్, హరిపోతురాజు పాల్గొన్నారు.

ఆరుగురు పేకాట రాయుళ్లు అరెస్టు

యడ్లపాడు: పేకాట స్థావరంపై పోలీసులు ఆకస్మిక దాడి చేశారు. మండలంలోని వంకాయలపాడు గ్రామ శివారులో పేకాట ఆడుతున్నారని పక్కా సమాచారంతో ఎస్ఐ టి శివరామకృష్ణ సిబ్బందితో కలిసి మెరుపుదాడి నిర్వహించారు. ఈ ఆకస్మిక దాడిలో ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని, నిందితుల నుంచి రూ. 14,730 నగదుతో పాటు 52 పేకముక్కలను స్వాధీనం చేసుకున్నారు.

ఘనంగా గురుపౌర్ణమి వేడుకలు

నరసరావుపేట ఈస్ట్: గురుపౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకొని పట్టణంలోని పలు సాయినాథుని ఆలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రకాష్‌నగర్‌లోని శ్రీసాయిక్షేత్రంలో సాయిబాబాను పవిత్ర నదీ జలాలతో ప్రత్యేక అభిషేకాలు, పూజలు జరిపారు.

- రొంపిచర్ల: మండలంలో గురుపౌర్ణమి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. రొంపిచర్లలోని షిర్డీసాయి బాబా మందిరం, కొత్తపల్లిలోని శ్రీసాయి బాబా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.
- యడ్లపాడు: గురుపౌర్ణమిని పురస్కరించుకుని మండలంలోని షిరిడీ సాయిబాబా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. సందెపూడి, లింగారావుపాలెం, కొత్తసాలన, బోయపాలెం హరిహరక్షేత్రం, జాలాది హరిహరదత్త క్షేత్రం తదితర ఆలయాల్లో బాబావారికి ప్రత్యేక అలంకరణలు చేశారు.
- శావల్యాపురం: మండలంలోని కారుమంచి గ్రామంలో వేంచేసియున్న సాయిబాబా దేవాలయంలో 17వ వార్షికోత్సవ గురుపౌర్ణిమి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. స్వామివారిని ప్రత్యేకంగా నూతన వస్త్రాలు పూలదండలతో అలంకరణ చేసి స్వామివారికి అర్చనలు అభిషేకాలు విశేష పూజలు నిర్వహించారు.
- చిలకలూరిపేట: పట్టణంతో పాటు మండలంలోని పలు గ్రామాలలో ఉన్న సాయిబాబా దేవాలయాలలో గురుపౌర్ణమి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని గోవిందపురం గ్రామంలోని సాయిబాబా దేవాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.
- నాదెండ్ల: గురుపౌర్ణమిని పురస్కరించుకుని ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. చిలకలూరిపేట నూతన మార్కెట్‌యార్డు సమీపంలోని షిర్డీసాయి సేవాశ్రమంలో గురుపౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. గణపవరం శాంతినగర్‌లోని షిర్డీసాయి ఆలయంలో పూజారి ఫణి ఆధ్వర్యంలో పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.
- వినుకొండ: పట్టణంలోని బోసుబొమ్మ సెంటర్ వద్ద వేంచేసి ఉన్న సద్గురు షిర్డీ సాయి బాబా ఆలయ అధ్యక్షుడు దోగిపర్తి బాబు, ప్రధాన అర్చకులు పోతుకూచి శ్రీనివాస శర్మ, ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారు. తెల్లవారుజామునుంచి స్వామి వారికి అభిషేకాలు, అలంకరణలు ప్రత్యేక పూజలు నిర్వహించారు.



గోవిందపురం గ్రామంలో అన్నదానం నిర్వహిస్తున్న దృశ్యం

ఉన్నత లక్ష్యాలు ఏర్పరచుకోండి

డిస్ట్రిక్ట్ సివిల్ సప్లయిస్ మేనేజర్ నారదముని

చిలకలూరిపేట: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు కలిగి ఉండాలని డిస్ట్రిక్ట్ సివిల్ సప్లయిస్‌మేనేజర్ బి.నారదముని చెప్పారు. పసుమర్రులోని మద్ది కామయ్య జెడ్పీ హైస్కూల్‌లో గురువారం మెగా పేరెంట్స్ టీచర్స్ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో స్కూల్ హెచ్ఎం వై.హనుమంతరావు, ఎస్ఎంసీ చైర్మన్ కోటా సుదర్శన్, వైస్‌చైర్మన్ షేక్‌గౌసియా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

- నరసరావుపేట ఈస్ట్: మెరుగైన విద్యావిధానం అమలులో తల్లిదండ్రుల సూచనలు ఎంతో విలువైనవని శ్రీసుబ్బరాయ అండ్ నారాయణ కళాశాల పాలకవర్గ అధ్యక్ష్య, కార్యదర్శులు కపలవాయి విజయకుమార్, నాగసరపు సుబ్బరాయగుప్త తెలిపారు. కళాశాల ఆడిటోరియంలో గురువారం ఇంటర్మీడియేట్ విద్యార్థుల ఆత్మీయ, మెగా పేరెంట్ టీచర్ సమావేశం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.ఎస్.సుధీర్ అధ్యక్షత వహించారు.
- బొల్లాపల్లి: మండలంలో గురువారం మెగా పేరెంట్స్ కమిటీ సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా గంగుపల్లి తండా, దోమలగుండం తదితర పాఠశాలలో రెగ్యులర్ ఉపాధ్యాయులు నియమించాలని విద్యార్థులు తల్లిదండ్రులు సమావేశంలో కోరారు. మండలంలోని పలు పాఠశాలలో కొందరు విద్యార్థులకు తల్లికి వందనం నగదు జమున వ్యత్యాసం ఉందని విద్యార్థులు తల్లిదండ్రులు సమావేశంలో ఉపాధ్యాయుల దృష్టికి తీసుకువచ్చారు. కొందరు విద్యార్థులకు తల్లికి వందనం నగదు జమ కాలేదన్నారు.
- వినుకొండ: ప్రభుత్వ పాఠశాలల్లో తల్లిదండ్రుల సమావేశాలను గురువారం నిర్వహించారు. జడ్పీ హైస్కూల్ ఎస్ఎస్పీ కాలనీ వినుకొండలో హెడ్ మాస్టర్ సి.హెచ్. వీరప్పయ్య అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. తల్లిదండ్రులతో పాటు దాతలు పాఠశాల పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.
- శావల్యాపురం: విద్యార్థుల భవిష్యత్తుకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాత్ర అత్యంత కీలకమని ఎమ్మెల్యే ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు అన్నారు. గురువారం మెగా పేరెంట్స్-టీచర్స్ సమావేశం కార్యక్రమం మండలంలోని అన్ని పాఠశాలల్లో నిర్వహించారు.
- నాదెండ్ల: విద్యార్థుల భవిష్యత్తు కోసం బడివైపు ఒక అడుగు అనే నినాదంతో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో మెగా పేరెంట్స్- టీచర్స్ మీట్ (పీటీఎం) ఏర్పాటు చేసినట్లు ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు చెప్పారు. మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో గురువారం మెగా పీటీఎం నిర్వహించారు.



చిలకలూరిపేటలో విద్యార్థులకు నగదు బహుమతులు అందజేస్తున్న దృశ్యం



సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

నరసరావుపేట డివిజన్

99122 25439 (నరసరావుపేట)
90105 83302 (చిలకలూరిపేట)
97054 44152 (వినుకొండ)

Office mail : sakshigntadvt@gmail.com